ఆశీర్వదించండి.. అండగా ఉంటా

● కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్

యూసుఫ్‌గూడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవ చేయాలన్న తపన, సంకల్పంతోనే రాజకీయాల్లోకి వచ్చానని, జూబ్లీహిల్స్‌లో ఆశీర్వదిస్తే అండగా ఉంటానని కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ హామీనిచ్చారు. ఆదివారం యూసుఫ్‌గూడలో పాదయాత్ర నిర్వహించారు. తొలుత అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. నవీన్‌యాదవ్‌కు మహిళలు దట్టీలు కట్టి మంగళహారతులతో స్వాగతం పలికారు. అన్న గెలుపు పక్కా అంటూ నవీన్‌ను మహిళలు ఆశీర్వదించారు. అనంతరం నవీన్ మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజలకు ఎళ్లవేళలా అండగా ఉంటానని హామీనిచ్చారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో జూబ్లీహిల్స్ వెనుకబడి పోయిందని ఆయన ఆరోపించారు. అనంతరం టీడీపీ నాయకుడు నారాయణస్వామిని కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌యాదవ్ కలిసి నవీన్‌యాదవ్‌కు మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో సమైక్యాంధ్ర సమితి అధ్యక్షుడు కుమార్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.


జై కాంగ్రెస్ అంటున్న మహిళలతో నవీన్‌యాదవ్

బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం: అనూషరామ్


వెంగళరావునగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకురాలు అనూష రామ్

బంజారాహిల్స్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమని ఆ పార్టీ ఖైరతాబాద్ నియోజకవర్గం సీనియర్ నాయకురాలు ఉప్పలపాటి అనూషరామ్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం వెంగళరావునగర్‌లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి ఆమె పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మాగంటి సునీతకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం కేటీఆర్ రోడ్డు షోకు కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్లారు. జూబ్లీహిల్స్ ప్రజలు బీఆర్‌ఎస్‌కు బ్రహ్మరథం పడుతున్నారని అనూషరామ్ అన్నారు. ఈ నెల 11న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి సునీతను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు.

క్రైస్తవ ఓటర్లు ఆలోచించి ఓటెయ్యాలి

పంజాగుట్ట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో రాజకీయ నాయకుల ప్రలోభాలకు లొంగకుండా ఆలోచించి ఓటెయ్యాలని క్రిస్టియన్ పొలిటికల్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా కన్వీనర్ జెరూషలేము మత్తయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజకీయ నాయకులు ఓటర్లను ప్రభావితం చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ క్రైస్తవులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆయన ఆరోపించారు.

● కాంగ్రెస్ నేతల బైక్ ర్యాలీ



కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు మద్దతుగా కంజర్ల సదాశివయాదవ్ ఆధ్వర్యంలో ఎర్రగడ్డ గోకుల్ థియేటర్ నుంచి నాయకులు బైకు ర్యాలీ నిర్వహించారు. బి శంకర్‌లాల్‌నగర్, హేమవతినగర్, నటరాజ్‌నగర్, ఓల్డ్ సుల్తాన్‌నగర్, ప్రేమ్‌నగర్ మీదుగా న్యూ ప్రేమ్‌నగర్ వరకు కొనసాగింది. మల్లేష్, శ్రీనివాసరావు, రామ్మోహన్ పాల్గొన్నారు.

- ఎర్రగడ్డ, (ఆంధ్రజ్యోతి)

పేదలకు బీజేపీ అండ: ఎంపీ ఈటల రాజేందర్

బోరబండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎల్లప్పుడూ పేదలకు అండగా ఉంటుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటయితేనే సమస్యలన్నీ పరిష్కారమవుతాయని ఆయన అన్నారు. బోరబండలోని వినాయకరావునగర్, బంజారానగర్, స్వరాజ్‌నగర్ బస్తీలలో ఆదివారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, జూబ్లీహిల్స్‌లో అధిక శాతం పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలే నివసిస్తున్నారని, కనీస వసతులు కరువై నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్‌లో సమస్యల పరిష్కారానికి బీజేపీ అభ్యర్థి దీపక్‌రెడ్డిని గెలిపించాలని ఆయన ప్రజలను విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో మోదీ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని జూబ్లీహిల్స్ ప్రజలను ఆయన విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చేసింది శూన్యమని ఆయన ఆరోపించారు.


బోరబండలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

బీఆర్‌ఎస్ నేతల వద్దకు ఈటల..

బంజారానగర్‌లో ప్రచారం చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్ బీఆర్‌ఎస్ నాయకులు ఉన్న చోటుకు వెళ్లి వారిని ఆప్యాయంగా పలకరించారు. బీజేపీలోకి రావాలని ఆ పార్టీ కార్యకర్తలు బీఆర్‌ఎస్ నాయకులను కోరగా, మళ్లీ ఈటలను తమ పార్టీలోకి తెచ్చుకుంటామని బీఆర్‌ఎస్ నాయకులు బదులిచ్చారు.

కార్యక్రమంలో బీజేపీ బోరబండ డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేష్, పార్టీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, కృష్ణ, పార్టీ నాయకులు, స్థానిక మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.


బోరబండ: ర్యాలీలో పాల్గొన్న మంత్రులు సీతక్క, శ్రీనివాస్‌రెడ్డి


వెంగళరావునగర్‌లో పాదయాత్రలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి తుమ్మల నాగేశ్వరావు తదితరులు


ఎల్లారెడ్డిగూడలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ప్రతిపక్షాలకు భంగపాటు తప్పదు: మంత్రులు

చివరి రోజు పలు బస్తీల్లో జోరుగా ప్రచారం

బంజారాహిల్స్/ బోరబండ/ వెంగళరావునగర్/ ఎర్రగడ్డ/ నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ప్రతిపక్షాలకు భంగపాటు తప్పదని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లు అన్నారు. ఉప ఎన్నిక ప్రచారం చివరి రోజైన ఆదివారం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు మద్దతుగా మంత్రులు ఆయా డివిజన్లలో ప్రచారం నిర్వహించారు. బోరబండలో మంత్రులు శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, వెంగళరావునగర్ డివిజన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఎల్లారెడ్డిగూడలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సోమాజిగూడ డివిజన్‌లో మంత్రి శ్రీధర్‌బాబు పాదయాత్ర చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా ఎర్రగడ్డలోని పద్మాశాలీ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొని ప్రచారం నిర్వహించారు. వెంగళరావునగర్‌లో కాంగ్రెస్, సీపీఐ పార్టీ నాయకులతో కలిసి మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ డప్పు


పద్మశాలీ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ తదితరులు


డప్పు కొడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే రాందాస్ నాయక్

కొడుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ మెరవాలంటే నవీన్‌యాదవ్ గెలవాలని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ కుట్రలను తిప్పికొట్టేందుకు జూబ్లీహిల్స్ ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఈ నెల 14న వెలువడే ఫలితాల్లో నవీన్‌యాదవ్ భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, మందుల సామెల్, యశస్వినిరెడ్డి, ఎంపీ మల్లు రవి, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సన్మాన గ్రహీతలతో వెంకటేశ్వర్లు, అజయ్‌మిశ్రా, విద్యాసాగర్ తదితరులు

అవినీతి వల్లే వెనుకబడిపోతున్నాం

● రాష్ట్ర పోలీస్ కంప్లయింట్స్ అథారిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు

పంజాగుట్ట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అవినీతి అధికారులంటూ ఎవరూ పుట్టరని, అవినీతి వల్లే మనం వెనుకబడిపోతున్నామని రాష్ట్ర పోలీస్ కంప్లయింట్స్ అథారిటీ సభ్యుడు డా.వర్రే వెంకటేశ్వర్లు అన్నారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఆధ్వర్యంలో ముందడుగు ఆత్మీయ అవార్డు కార్యక్రమాన్ని ఆదివారం బేగంపేట హరితా ప్లాజాలో నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాలలో నిజాయితీగా పనిచేస్తున్న పది మందిని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజయ్‌మిశ్రా, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు, అదనపు కలెక్టర్ విద్యాసాగర్, సింగర్ కౌసల్యలతో కలిసి ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ చేస్తున్న వినూత్న కార్యక్రమాలు సమాజంలో మంచి మార్పుకు దోహదం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు రాజేంద్ర, డా.స్రవంతి, స్వప్న, గీతానంద్, శరణ్య, రమేశ్‌బాబు, ప్రశాంత్, వంశీకృష్ణ, రాజేశ్, పారిశ్రామికవేత్త హరిప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ష్..! గప్‌చుప్

(5వ పేజీ తరువాయి)

సిద్ధం చేశారు. అంతేకాకుండా 15బృందాల ఫ్లైయింగ్ స్క్వాడ్ రాజకీయ నేతల కదలికలపై నిఘా ఉంచుతాయి. ఇక 65 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక పికెట్‌లను, ప్రధాన కూడళ్ల వద్ద చెక్‌పోస్టులను పెట్టారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు: కిషన్‌రెడ్డి

బోరబండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి దీపక్‌రెడ్డి గెలుపు ఖాయమని కేంద్రమంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా బోరబండ సైట్-1 కాలనీ రాజ్‌నగర్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆదివారం ఆయన పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, 11ఏళ్లలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, గడచిన రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు ఏమీ లేవని ఆరోపించారు. ప్రతిచోటా సమస్యలు రాజ్యమేలుతున్నాయని ఆయన ఆరోపించారు. ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బీజేపీ అభ్యర్థి గెలిస్తే కేంద్రం నుంచి అధిక నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని కిషన్‌రెడ్డి వెల్లడించారు. బోరబండ ప్రజల ఆశయాలు నెరవేర్చే దిశగా భారతీయ జనతా పార్టీ కట్టుబడి ఉన్నట్లు మంత్రి స్పష్టం చేశారు. బీజేపీ బోరబండ డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేష్, శ్రీశైలంయాదవ్, కృష్ణమోహన్, సూర్యాకుమార్ తదితరులు పాల్గొన్నారు.


రాజ్‌నగర్ బస్తీలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి


స్లేట్ స్మార్ట్ స్టార్ట్ 5కే రన్‌ను ప్రారంభిస్తున్న సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి, డెయిరీ ఫెడరేషన్ చైర్మన్ అమిత్‌రెడ్డి


రన్‌లో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

● సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి

ఖైరతాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి అన్నారు. జూదం, లోన్ యాప్స్, జంక్‌ఫుడ్, మొబైల్, రొట్‌లెర్నింగ్‌లకు దూరంగా ఉండాలని అవగాహన కల్పిస్తూ జరిగిన స్లేట్ స్మార్ట్ స్టార్ట్ 5కే రన్ ఆలోచింపజేసింది. పీవీ నరసింహారావు మార్గ్‌లోని జలవిహార్ నుంచి పీపుల్స్‌ప్లాజాకు తిరిగి జలవిహార్ వరకు జరిగిన ఈ రన్‌ను సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి, తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనుషుల జీవితాలను నాశనం చేస్తున్న 5 చెడు అలవాట్లను వదిలి మంచి పౌరులుగా ఎదిగేందుకు స్లేట్ స్కూల్ వారు అవగాహన కల్పిస్తూ రన్ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. 5కే ఎగెనెస్ట్ అనే థీమ్‌తో రన్‌ను నిర్వహించినట్టు విద్యా సంస్థల అధిపతి వాసిరెడ్డి అమర్‌నాథ్ తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ బీఆర్ఎస్‌దే: కేపీ వివేకానంద

బోరబండ, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ప్రజల మద్దతుతో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత విజయం ఖాయమని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. ఆదివారం బోరబండ వీకర్ సెక్షన్ కాలనీ, సాయిబాబా నగర్, బాబా సైలానీనగర్, స్వరాజ్‌నగర్ బస్తీల్లో మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 12ఏళ్లలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి మాగంటి గోపీనాథ్ చేసిన కృషి మరువలేనిదన్నారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.


ఎర్రగడ్డలో ర్యాలీ నిర్వహిస్తున్న శంకర్‌గౌడ్, దీపక్‌రెడ్డి తదితరులు

రాష్ట్రాన్ని దోచుకునే పార్టీలకు బుద్ధి చెప్పాలి

● జనసేన తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి శంకర్‌గౌడ్

ఎర్రగడ్డ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణను దోచుకున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు జూబ్లీహిల్స్ ప్రజలు బుద్ధి చెప్పాలని జనసేన రాష్ట్ర ఇన్‌చార్జి శంకర్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఎర్రగడ్డలో బీజేపీ అభ్యర్థి దీపక్‌రెడ్డితో కలిసి ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల వేళ కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదని ఆరోపించారు. దీపక్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు రాజలింగం, దామోదర్‌రెడ్డి, బీజేపీ ఎర్రగడ్డ డివిజన్ ఇన్‌చార్జి మేకల సారంగపాణి, బొట్ల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


బంజారా భారత్ స్వర్ణోత్సవాల నగారాను మోగిస్తున్న మాజీ మంత్రి రవీంద్ర నాయక్ తదితరులు

19 నుంచి ఢిల్లీలో బంజారా భారత్ స్వర్ణోత్సవాలు

● మాజీ మంత్రి రవీంద్ర నాయక్

పంజాగుట్ట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 19 నుంచి 21 వరకు బంజారా భారత్ స్వర్ణోత్సవాలను నిర్వహిస్తున్నామని అఖిల భారతీయ బంజారా మహాసేవా సంఘ్ వ్యవస్థాపకుడు, మాజీ మంత్రి రవీంద్ర నాయక్ తెలిపారు. 20న డిమాండ్ల సాధనకు జంతర్ మంతర్ వద్ద మహాధర్నాను నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రముఖ దళిత నాయకులు జేబీ రాజు, దయానంద్, సంస్థ ప్రతినిధులతో కలిసి చలో ఢిల్లీ నగారాను ఆయన మోగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో లంబాడీ గిరిజనులు, ఆదివాసీల మధ్య చిచ్చు పెట్టి తమ రాజకీయ పబ్బం గడుపుకోవాలని కొంత మంది నాయకులు చూస్తున్నారని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాగమణి నాయక్, హనుమనాయక్, శంకర్‌నాయక్, నరేష్‌నాయక్, కేతావత్ రాజు, హరిచంద్ నాయక్, బావేజి తదితరులు పాల్గొన్నారు.

ఐ ఫోన్ అయినా చిక్కాల్సిందే..!

(5వ పేజీ తరువాయి)

సైబర్ పోలీసుల పరిశోధనలో తేలింది. సాధారణంగా కొరియర్, డెలివరీ ఏజెంట్‌గా చెప్పుకుంటూ వీరు మోసానికి తెగపడుతున్నారు. ఓటీపీ వచ్చింది.. త్వరగా చెప్పండంటూ లేని పోని హడావుడి సృష్టించి ఓ నిర్దిష్టమైన నంబర్‌కు కాల్ చేసేలా ప్రోత్సహిస్తారు. దానితో ఐఫోన్ వినియోగదారులు తమకు తెలియకుండానే తమ ఫోన్ల నియంత్రణ మొత్తం స్కామర్ల చేతిలో పెడుతున్నారు. సాధారణంగా ూ21, ూ401, ూ72 నంబర్లకు కాల్ చేయించడం ద్వారా మోసాలకు వారు తెరలేపుతున్నారని ఎథికల్ హ్యాకర్లు పేర్కొంటున్నారు. ఎంత గొప్ప సెక్యూరిటీ అయినా హ్యాక్ కాకుండా ఉండటం అనేది ఇటీవలి కాలంలో అసాధ్యంగానే మారిందంటున్నారు.

బలహీనతే ఆయుధంగా..

ప్రధానంగా యూజర్ బలహీనతే సైబర్ క్రిమినల్‌కు ఆయుధంగా మారుతుంటుంది. పెగాసిస్ లాంటి సాఫ్ట్‌వేర్‌లను సైబర్ నేరగాళ్లు వినియోగించడమంటూ జరగదు. వారెప్పుడూ కూడా వినియోగదారుల బలహీనత, ఆశలపైనే దృష్టి సారిస్తుంటారు. ఇటీవలి కాలంలో ఐఫోన్లను వాట్సాప్ మార్గంలో హ్యాక్ చేస్తున్నారని, ఏదో తేడా కొడుతుందని వినియోగదారుడు గుర్తించే లోపుగానే చేయాల్సిన నష్టమంతా చేసేస్తున్నారని టెక్ నిపుణులు చెబుతున్నారు. కాల్ ఫార్వర్డింగ్ ఫీచర్లతో మోసగాళ్లు దోచుకుంటుండటమే ఇప్పుడు ఆందోళనగా ఉందని తెలంగాణా స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రతినిధులు వెల్లడించారు. ఈ కాల్ ఫార్వర్డింగ్ ఫీచర్లు ఐఓఎస్, ఆండ్రాయిడ్ అన్నిటిలోనూ ఒకేలా ఉండటం మోసగాళ్లకు వరంగా మారిందని, వినియోగదారుల అజాగ్రత్త, అత్యాశ మోసగాళ్ల పాలిట వరంగా మారుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎలా తెలుసుకోవాలి..

- మీ ఫోన్ మోసగాళ్ల చేతికి చిక్కిందా లేదా తెలుసుకోవాలనుకుంటే ముందుగా *#21# కు డయల్ చేసి కాల్స్ ఫార్వార్డ్ అవుతున్నాయేమో గమనించాలి.
- *#67# కు కాల్ చేయడం ద్వారా కండిషనల్ కాల్ ఫార్వార్డింగ్ పరీక్షించవచ్చు. తెలియని నంబర్లకు కాల్ ఫార్వార్డింగ్ జరిగిందని గుర్తిస్తే, మీ ఫోన్ సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కినట్లుగా భావించాలి.

ఎలా అడ్డుకోవాలంటే..

- తెలియని వ్యక్తులు కాల్‌చేసి, మీరు ఫలానా నంబర్ నొక్కండి అని అంటే ఎట్టి పరిస్థితిల్లోనూ ఆ నంబర్లకు డయల్ చేయవద్దు.
- కాల్‌ఫార్వర్డింగ్ వద్దనుకుంటే మీ ఐ ఫోన్‌లో సెట్టింగ్స్‌లోకి వెళ్లి కాల్ ఫార్వర్డింగ్ ఆప్షన్ స్విచాఫ్ చేయాలి.
- మీ బ్యాంకు ఖాతాలు, ఫోన్ బిల్లులను జాగ్రత్తగా గమనిస్తే ఒకవేళ మోసాల బారిన పడితే గుర్తించడం వీలవుతుంది.
- రెండంచెల భద్రత ఎంచుకోండి.. వ్యక్తిగత పిన్ కావాల్సి ఉండటంతో మోసగాళ్ల బారిన పడేందుకు తక్కువ అవకాశాలుంటాయి.
- ఒకవేళ మీరు మోసపోయారని గుర్తిస్తే వెంటనే సైబర్ పోలీసులకు 1930కు కాల్ చేయాలి.

● కాంగ్రెస్‌లోకి బీజేపీ నాయకులు



బోరబండ డివిజన్ సాయిబాబానగర్‌లో బీజేపీ నుంచి పలువురు యువకులు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వ విజయ్‌బాబు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బండారి కుమార్, నక్క సురేశ్, హేమంత్, పవన్, గోపి, శరత్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.
- బోరబండ, ఆంధ్రజ్యోతి

బాలానగర్‌లో వీధి కుక్కల స్వైరవిహారం

● నలుగురు పారిశుధ్య కార్మికులతోసహా 20 మందిపై దాడి

హైదర్‌నగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బాలానగర్‌లో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడి చేస్తున్నాయి. ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో 20 మందిపై దాడి చేశాయి. వీరిలో నలుగురు పారిశుధ్య కార్మికులు ఉన్నారు. నర్సాపూర్ క్రాస్‌రోడ్, రాజుకాలనీ, బీబీఆర్ ఆస్పత్రి తదితర ప్రాంతాల్లో వీధి కుక్కలు పారిశుధ్య కార్మికులపై దాడి చేశాయి. బాధితులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. జీహెచ్ఎంసీ అధికారులు వీధికుక్కలను పట్టుకెళ్లాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


పారిశుధ్య కార్మికురాలి కాలిపై కుక్కగాటు

చలికాలంలో వెచ్చగా..





చలి పులి ప్రారంభమైంది. గడిచిన రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు క్రమేణా తగ్గుతూ, చలి ఎక్కువ అవుతోంది. దాంతో ప్రజలు చలి బారిన పడకుండా ఉండడానికి తగిన జాగ్రత్తలు మొదలుపెట్టారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వ్యాపారులు ముఖ్యంగా ఫుట్‌పాత్, చిల్లర వర్తకులు ఉన్ని దుస్తుల విక్రయాలను ప్రారంభించారు. ఫలితంగా సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్, పార్క్‌లేన్, గురుద్వారా, జీడిమెట్ల బస్టాప్, పాతగాంధీ ఆస్పత్రి, ట్యాంక్‌బండ్ తదితర ప్రాంతాల్లో స్వెట్టర్లు, జర్కిన్లు, మంకీ క్యాప్‌లు, హ్యాండ్ గ్లోజ్‌ల విక్రయాల స్టాల్స్ వెలిశాయి. ఆదివారం కావడంతో ఈ స్టాల్స్ కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. కాగా షోరూమ్‌లు, దుకాణాలతో పోలిస్తే తక్కువ ధరలకు అందుబాటులో ఉండడంతో ఈ స్టాల్స్‌లో కొనుగోలు చేసేందుకు ప్రజలు ముఖ్యంగా యువత ఆసక్తి చూపుతున్నారు.

- సికింద్రాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి)




స్వెట్టర్లు, జర్కిన్లు కొనుగోలు చేస్తున్న యువతీ, యువకులు

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ రమేష్

తిరుమలగిరి నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను నియంత్రించవచ్చని తిరుమలగిరి ఏసీపీ రమేష్, సీఐ నాగరాజు అన్నారు. ఆదివారం తిరుమలగిరి లాల్‌బజార్‌లోని హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఏసీపీ మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమన్నారు. ఆలయ ప్రాంగణం చుట్టూ సీసీ కెమెరాలు అమర్చడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మహేష్, జోసఫ్, శివ, అనిల్, సిబ్బంది రమేష్, రామకృష్ణ పాల్గొన్నారు.



ప్రార్థనలో పాల్గొన్న బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్

హోలీ ట్రినిటీ చర్చి సందర్శన

తిరుమలగిరి నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బొల్లారం హోలీ ట్రినిటీ చర్చిని ఆదివారం బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ సందర్శించారు. స్వాతంత్రం కంటే ముందు పనిచేసిన ఆర్మీ అధికారుల సమాధులను ఆయన పరిశీలించి ఘనంగా వారికి నివాళులు అర్పించారు. చర్చి, సమాధులను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని అన్నారు. సమాధుల వద్దకు రోడ్డు నిర్మాణ పనులను కూడా చేపడతామని అన్నారు. అనంతరం చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. చర్చి నిర్వాహకులు, కమిటీ సభ్యులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ప్రతి సంవత్సరం చర్చి సమాధుల సందర్శనలో భాగంగా ఈ సంవత్సరం కూడా సందర్శించినట్టు ఆయన వెల్లడించారు.

ఉచిత మెగా హెల్త్ క్యాంప్



హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించిన ఫౌండేషన్ నిర్వాహకులు ముకుల్

మారేడుపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రీగణేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ నిర్వాహకులు ముకుల్ ఆదివారం కంటోన్మెంట్ బోర్డు ఐదో వార్డు పరిధిలోని కాకాగూడ కమ్యూనిటీ హాల్లో మారేడుపల్లి లయన్స్ క్లబ్, మెడికవర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ క్యాంపులో పేద ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు, జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, గైనకాలజీ, కార్డియాలజీ విభాగాలకు సంబంధించి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. అనంతరం ముకుల్ మాట్లాడుతూ కళ్లజోళ్లు, కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి కూడా ఫౌండేషన్ ద్వారా ఉచితంగా చేయిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జోరుగా సీతాఫలాల అమ్మకాలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న సీతాఫలాలు

చిలకలగూడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీతాఫలం మధురం. తియ్యని తీపితో నిండిన సీతాఫలాలు మార్కెట్‌లో విరివిగా లభ్యమవుతున్నాయి. సికింద్రాబాద్‌లోని ఆలుగడ్డ బావి, తార్నాక ఫ్లైఓవర్, పెరేడ్ గ్రౌండ్, సఫిల్‌గూడ రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో జోరుగా అమ్మకాలు సాగుతున్నాయి. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం దిగుబడి అధికంగా ఉందని, అమ్మకాలు బాగా జరుగుతున్నాయని వెంకటేష్ అనే వ్యాపారి తెలిపాడు.



ప్రవచనకర్త సంతోష్ కుమార్‌తో బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ప్రతినిధులు

మల్లాపూర్‌లో ఘనంగా కార్తీక వన సమారాధన

తార్నాక, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం మల్లాపూర్‌లోని వీఎస్‌ఆర్ గార్డెన్‌లో కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. లలిత విష్ణు సహస్రనామ పారాయణం, రుద్రహోమాన్ని భక్తి శ్రద్ధలతో చేశారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డా. బాచుపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి ప్రవచనం అందరిని ఆకట్టుకుంది. అనంతరం పేద బ్రాహ్మణ విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు, అర్హులైన విద్యార్థులకు ఐఎఎస్ పరీక్షలకు శిక్షణ ఇవ్వాలని సభ్యులు తీర్మానించారు. కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సతీమణి జమున, బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య అధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి ఎస్. సూర్య నారాయణ శర్మ, కామేశ్వరావు, జె.వి.ఎల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యుల పాత్ర అమోఘం : తలసాని



9ఎస్ఇసిపి 10 కార్యక్రమంలో పాల్గొన్న తలసాని

సికింద్రాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సామాజిక, ధార్మిక సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు ఎల్లప్పుడూ ముందుంటారని, వారి పాత్ర అమోఘమని మాజీమంత్రి, సనత్‌నగర్ శాసనసభ్యుడు తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం నెక్లెస్ రోడ్డులోని సంజీవయ్య పార్కులో ఆర్యవైశ్య గ్లోబల్ సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన సమారాధన మహోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు వివిధ రకాల వ్యాపారాలు నిర్వహిస్తూనే, మరోవైపు అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతారని తెలిపారు. అదేవిధంగా దేవాలయాల నిర్మాణం, నిర్వహణలో ఆర్యవైశ్యుల భాగస్వామ్యం ఉంటుందో ఆ దేవాలయాలు ఎంతో అభివృద్ధి చెందుతాయని ప్రశంసించారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని బల్కంపేట ఎల్లమ్మ కనకదుర్గమ్మ, మహాకాళి అమ్మవారు, గణేష్ దేవాలయం తదితర ప్రముఖ ఆలయాల్లో తన ప్రత్యేక చొరవ కారణంగా అభివృద్ధి కమిటీల్లో వారికి ప్రాతినిధ్యం ఇచ్చిన విషయాన్ని తలసాని గుర్తు చేశారు. సంఘం నాయకులు బాబూరావు, రమణయ్య, రాఘవేంద్రరావు, దీపక్, రమేష్, ప్రకాశం, సంపత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి : జంపన

బోయినపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పాఠశాలల్లో క్రీడల కోసం ప్రత్యేక నిధులు ఏర్పాటు చేయాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ జంపన్న ప్రతాప్ పేర్కొన్నారు. అలాగే క్రీడాకారులను ప్రోత్సహించి క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 17 నుంచి 19 వరకు సరూర్‌నగర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి తెలంగాణ ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలు కుంచెట్టి క్రీడా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరగనున్నాయి. ఈ క్రీడా పోటీలకు సంబంధించి వాల్ పోస్టర్‌ను ఆదివారం బోయినపల్లిలోని బాపూజీనగర్‌లో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో చదువుతో పాటు, క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. క్రీడాకారులకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రైవేట్ పాఠశాలలు కూడా క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. వారానికి కనీసం రెండు పీరియడ్లు చిన్నారులకు వ్యాయామ విద్య నేర్పించాలన్న నిబంధనలు కూడా ఆచరణకు నోచుకోవడం లేదు కాబట్టి ఇలాంటి క్రీడా పోటీలు జరుగుతున్నప్పుడైనా పాఠశాలల్లో చదువుతున్న క్రీడాకారులను ప్రోత్సహిస్తూ క్రీడల్లో పాల్గొనేవిధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొంచం స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ సంస్థ చైర్మన్ మహేశ్వర్ భవాని ప్రసాద్ సెవెంత్ స్పోర్ట్స్ డైరెక్టర్ వెంకటేశ్,ఫిజికల్ డైరెక్టర్ సుధీర్, ప్రేమ్ కుమార్ ముదిరాజ్, నరసింహ, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రచయితలు, కవులు, కళాకారులు సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

- ప్రముఖ రచయిత్రి కాత్యాయిని

రాంనగర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : యువ రచయితలు, కవులు, కళాకారులు తమ సృజనకు పదునుపెట్టి సమాజ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ప్రముఖ రచయిత్రి కాత్యాయిని విద్మహే పిలుపునిచ్చారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 22న కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయంలో యూత్ లిటరేచర్ ఫెస్టివల్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కళలు, కలాలు ఏం చేయాలనే దానిపై ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎప్పుడైతే మనుషుల మధ్య విభజన రేఖలు గీసి అడ్డుగోడలు నిర్మిస్తున్నారో వాటిని ఛేదించాల్సిన బాధ్యత రచయితలు కళాకారులదేనని అన్నారు. నేటి యువత మత, కులతత్వ శక్తుల బారిన పడకుండా మానవతా వాదం వైపు నడిపించడమే ప్రధాన ఉద్దేశంగా ఈ ఉత్సవాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈసందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏకే ప్రభాకర్, పసునూరి రవీందర్, సామిడి జగన్‌రెడ్డి, మెర్సిమార్గరేట్, స్కైబాబా, యువరాణి, నాళేశ్వరం శంకరం, మోత్కూర్ శ్రీనివాస్, శ్రీనిధి తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్ ప్రారంభం

ఈనెల 22న యూత్ లిటరేచర్ ఫెస్టివల్ జరుపనున్నట్లు సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం కార్యవర్గ సమావేశంలో ఆ సంస్థ ప్ర తినిధులు తెలిపారు. ఈ సందర్భంగా వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. సుందరయ్యవిజ్ఞానకేంద్రం తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో ప్ర ముఖ రచయిత్రి కాత్యాయని విద్మహే పా ల్గొని ఇప్పుడు కళలు, కలాలు ఏం చేయాలనే అంశంపై కవులు, కళాకారులు, రచయితలు తమ సృజనకు పదును పెట్టాలని ఈ సాహిత్య ఉత్సవాల్లో భాగం కావాలని పిలుపునిచ్చారు. భూపతి వెంకటేశ్వర్లు, ఏకె ప్రభాకర్, పసునూరి రవీందర్, జగన్‌రెడ్డి, మార్గరెట్, స్కైబాబ, యువరాణి, నాళేశ్వరం శంకరం, మోత్కూరి శ్రీనివాస్, శ్రీనిధి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హైకోర్టు సీనియర్ న్యాయవాది డాక్టర్ టి. సుభాషిణి

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- హైకోర్టు సీనియర్ న్యాయవాది డాక్టర్ టి. సుభాషిణి

ముషీరాబాద్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు రాజ్యాంగం కల్పించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని హైకోర్టు సీనియర్ న్యాయవాది డా క్టర్ టి. సుభాషిణి అన్నారు. ఆదివారం న్యాయసేవల దినోత్సవాన్ని పురస్కరించుకొని ముషీరాబాద్‌లోని రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో న్యాయసేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సుభాషిణి మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించే విధంగా తమ వంతు కృషిచేస్తున్నాం అన్నారు. న్యాయ సలహాలపై లీగల్ వలంటీర్లు స్వచ్ఛందంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధి ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కుల రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి

రాంనగర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కులరహిత సమాజ స్థాపకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. కులంపై కలిసికట్టుగా ఉద్యమిద్దాం అని వారు పిలుపునిచ్చారు. కుల నిర్మూలన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఛాయస్-2025 జాతీయ సదస్సును నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ టి. రజని, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జి. రాధారాణిలు తదితరులు హాజరయ్యారు. విశ్రాంత న్యాయమూర్తులు మాట్లాడుతూ కుల, మతాంతర వివాహాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఛాయస్ సావనీర్‌ను ఆవిష్కరించారు. వహీద్, విమలక్క, స్కైలాబ్‌బాబు, హనుమంత్, స్వరాజ్యలక్ష్మి, సూర్యనారాయణ, బైరి నరేష్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి కల్యాణం



మంగళ సూత్రాలను భక్తులకు చూపుతున్న అర్చక స్వాములు

మల్కాజిగిరి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆనంద్‌బాగ్‌లోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ప్రతి నెల రెండో ఆదివారం నిర్వహించే స్వామివారి కల్యాణోత్సవాన్ని ప్రధానార్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు, అర్చకులు తులసి రమణాచార్యుల నేతృత్వంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగిన స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన పలువురు భక్తులు హాజరై కల్యాణాన్ని కనులారా ఆస్వాదించారు.



పక్షులు, జంతువులు, పండ్లు, కూరగాయల చిత్రాలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకట్టుకుంటున్న చిత్రాలు

రామంతాపూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రామంతాపూర్ డివిజన్ నెహ్రూ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలోని గోడలపై రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పూలు, పండ్లు, కూరగాయలు, పక్షులు, జంతువులు, తెలుగు, ఆంగ్ల అక్షర మాల తదితర చిత్రాలు రూపొందించి అందంగా తీర్చిదిద్దుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులకు ఆహ్లాదాన్ని, ఉత్సాహాన్ని కల్పించడంతో పాటు విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో గోడలపై ఇదే తరహా చిత్రాలు అధికారులు రూపొందించనున్నట్లు టీచర్లు హరిప్రియ, ఫర్జనా, కృష్ణ ప్రియ, శుక్ల తెలిపారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణప్రసాద్

పరీక్షలతోనే క్యాన్సర్ నిర్ధారణ, నివారణ

మౌలాలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ పరీక్షలు నిర్వహించిన తర్వాతనే క్యాన్సర్ నిర్ధారణ చేస్తే నివారణ సాధ్యమని డాక్టర్ కృష్ణ ప్రసాద్ అన్నారు. ఆదివారం గౌతమ్‌నగర్ డివిజన్‌లోని సాయినగర్‌లోని సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బసవతారకం ఇండో అమెరికన్ ఆస్పత్రి సౌజన్యంతో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. సుమారు 300 మంది రిజిష్టర్ చేసుకోగా వంద మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మల్లేష్, లింగారెడ్డి, హనుమంతరావు, డాక్టర్ నీల్, త్రివేది తదితరులు పాల్గొన్నారు.



పార్కును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ప్రేంకుమార్

సీఫెల్ కాలనీలో పార్కు ప్రారంభం

మల్కాజిగిరి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్ ఆనంద్‌బాగ్ సీఫెల్‌కాలనీలోని పార్కును సుందరీకరించారు. రూ. 10 లక్షలతో పార్కు చుట్టూ ప్రహరీ, రూ.4 లక్షలతో పార్కులో వివిధ అభివృద్ధి పనులు, పచ్చదనం క్రీడాపరికరాలు, చిన్నారుల కోసం మరిన్ని సదుపాయాలు కల్పించారు. పూర్తి చేసిన పార్కును కార్పొరేటర్ ప్రేంకుమార్ ఆదివారం స్థానికులతో కలిసి ప్రారంభించారు. సుందరీకరించిన ఈ పార్కు స్థానికులకు ఎంతగానో ఆహ్లాదాన్ని కల్పించనుందని అన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు కృష్ణ, ఓంరాజ్, శ్రీమాన్ నారాయణ, ఆనంద్, చంద్రకళ, సోమయ్య, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మించండి


- డైమండ్ పాయింట్ రహదారిపై దుమ్ము, ధూళి
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు




తాత్కాలిక రోడ్డులో దుమ్ము రేపుతున్న వాహనాలు

బోయినపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని డైమండ్ పాయింట్ ప్రధాన రహదారిలో రెండు నెలల క్రితం వరకు భారీ గుంతలతో వాహనదారులు నరకం చూశారు. ఈ విషయమై పైన ప్రజలు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చింది. దీనికి స్పందించిన అధికారులు ఎట్టకేలకు రహదారి పనులు చేపట్టడంతో సమస్య పరిష్కారమవుతుందని భావించారు. కానీ ప్రస్తుతం దుమ్ము, ధూళితో నానా తిప్పలు పడుతున్నారు. పనులు నత్తనడకన సాగడంతో మరలా నరకం చూస్తున్నారు. రెండు వందల మీటర్ల మేర రోడ్డు తవ్వి వెట్‌మిక్స్‌తో నిర్మాణం చేపట్టారు. ఇప్పటివరకు బీటీ పనులు చేపట్టకపోవడం, వేసిన తర్వాత వెట్‌మిక్స్‌ను తడపకపోవడంతో ఏదైనా వాహనం వెళితే వెనుక ఉన్న వాహనదారులు దుమ్ము కొట్టుకుపోతున్నారు. కళ్లలో దుమ్ము పడి ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో గుంతలతో ఇబ్బందులు పడ్డాం, ఇప్పుడు చూస్తే దుమ్ముతో చస్తున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వెంటనే బీటీ రోడ్డును నిర్మించాలని స్థానిక వ్యాపారస్థులు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారులు స్పందించాలి



డైమండ్ పాయింట్ రహదారిపై వెట్‌మిక్స్‌తో నిర్మాణం చేసిన రోడ్డు పైన దుమ్ము, ధూళి పైకి లేస్తున్నది. దీంతో పెద్ద వాహనాలు ముందు వెళ్తుంటే ద్విచక్ర వాహనాలకు ముందు ఏమి ఉందో కూడా కనిపించడం లేదు. అధికారులు వెంటనే స్పందించి పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలి.

- నవీన్, బోయినపల్లి

బీటీ రోడ్డు నిర్మించాలి



వేసిన తాత్కాలిక రోడ్డుపై దుమ్ము రేగుతోంది. పక్కనే ఉన్న ఆస్పత్రికి వస్తే ఈ దుమ్ము మాపైన పడింది. అక్కడ ఉన్నంత సేపు దుమ్ముతో నరకం అనుభవించాం. ఆస్పత్రి వాళ్ళుఒడెండరె తడిపినంత వరకు బాగానే ఉంది. ఆ తర్వాత మరలా దుమ్ము పైకి లేస్తూ ముక్కులోకి చేరి శ్వాస ఆగిపోయేంత పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలి.

- లక్ష్మీ ప్రసన్న, కంసారి బజార్